ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

శ్రీకాకుళం

జిల్లా వార్తలు

బుధవారం 17 ఏప్రిల్ 2024




# వైసీపీని సాగనంపండి

## ● కూటమి అభ్యర్థులను మెజార్టీతో గెలిపించండి

● సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

● పార్టీ శ్రేణులకు టీడీపీ అధినేత చంద్రబాబు దిశానిర్దేశం

శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/ పలాస, ఏప్రిల్ 16: 'ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయండి. ఎన్డీయే కూటమి అభ్యర్థులను మెజార్టీతో గెలిపించండి. సమష్టి కృషితో వైసీపీని సాగనంపండి' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి పలాసలో చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభ విజయవంతమైంది. రాత్రి ఆయన పలాసలో బస చేశారు. మంగళవారం ఉదయం 7గంటల నుంచి ఆయన ప్రత్యేక బస్సులో నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. మాజీమంత్రి గౌతు శ్యామసుందరశివాజీ కుటుంబంతో కాసేపు మాట్లాడి.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే స్థానిక టీడీపీ కార్యాలయంలో ముఖ్య నేతలతో జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. పలాసలో సభకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన రావడంతో.. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీష గెలుపుపై ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలని, సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు మరింతగా వివరించాలని శిరీషకు, పార్టీ శ్రేణులకు సూచించారు. వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆయన హెలీకాప్టర్‌లో హైదరాబాద్ పయనమయ్యారు. ఇదిలా ఉండగా చంద్రబాబు సభను విజయవంతం చేసిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు కూటమి అభ్యర్థి గౌతు శిరీష ధన్యవాదాలు తెలిపారు. పలాసలో విజయం తనదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు వెంట టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గౌతు శివాజీ కుటుంబంతో చంద్రబాబు, పక్కన అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు



పలాసలో సమావేశానికి హాజరైన టీడీపీ నేతలు, కార్యకర్తలు

### ● క్రియాశీలక రాజకీయాలకు గుండ దంపతులు దూరం

ఇకపై క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటామని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ప్రకటించారు. శ్రీకాకుళం అసెంబ్లీ టికెట్ లక్ష్మీదేవికి నిరాకరించి గొండు శంకర్‌కు ఇచ్చిన నేపథ్యంలో గుండ దంపతులు అలక వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో చంద్రబాబు పిలుపుమేరకు గుండ దంపతులిద్దరూ మంగళవారం పలాసలో ఆయనను కలిశారు. పార్టీ కోసం కలిసి పనిచేయాలని చంద్రబాబు కోరగా.. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను వెల్లడించి గుండ దంపతులు వెనక్కి వచ్చేశారు. కొద్దిసేపటి తర్వాత తాము క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకున్నట్టు ప్రకటించారు. '40ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎటువంటి మచ్చలేకుండా కార్యదీక్షతో పార్టీ కోసం పనిచేశాం. రెండేళ్ల నుంచి పార్టీలో అసమ్మతి పేరుతో జరుగుతున్న కార్యక్రమాలు.. వాటి వెనుక వాస్తవాలను అర్థం చేసుకోగలరు. పార్టీ తీసుకున్న నిర్ణయం మాకు ఎంతో బాధ కలిగించింది. అభిమానులు, కార్యకర్తలు ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నా.. రాజకీయాల్లో గత అనుభవాల దృష్ట్యా, ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆ దిశగా మేము ముందుకెళ్లడం లేదు. ఇదే విషయాన్ని చంద్రబాబుకు తెలియజేశామ'ని గుండ అప్పలసూర్యనారాయణ, లక్ష్మీదేవి స్పష్టం చేశారు. ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు అర్థం చేసుకుంటారని భావిస్తున్నామని తెలిపారు.

● పాతపట్నం టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు కూడా చంద్రబాబు కబురు పంపారు. కాగా ఆయన అక్కడ నుంచి పలాస చేరుకునే సమయానికి చంద్రబాబు వెళ్లిపోతారని తెలియడంతో కలమట రాలేదు.



చంద్రబాబును కలిసి వస్తున్న గుండ దంపతులు





## ఆకట్టుకున్న శ్రీరాముడి సైకత శిల్పం

శ్రీరామనవమిని పురస్కరించుకుని గాజులకొల్లివలసలో సంగమేశ్వర ఆలయ సమీపంలో హరికృష్ణ రూపొందించిన శ్రీరాముడి సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది.

- ఆమదాలవలస

## నేటి నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

● నువ్వలరేవులో 9 రోజుల పాటు నిర్వహణ

● 300 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 16: ఆచార, సంప్రదాయాలకు నిలయమైన నువ్వలరేవు గ్రామం.. శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబైంది. బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. గ్రామస్థులంతా శ్రీరామ భక్తులే కావడంతో 300 ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తూనే ఉన్నారు. పేటచూపుల పేరుతో రాత్రివేళ నిర్వహించే ఈ ఉత్సవాలను చూసేందుకు చుట్టుపక్కల గ్రామస్థులతో పాటు ఒడిశా నుంచి కూడా భక్తులు తరలివచ్చారు. ముందుగా గ్రామదేవత బృందావతి ఆలయంలో, తర్వాత శ్రీరామాలయంలో జెండాను ఎగురవేసి ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. తొమ్మిదిరోజులు పాటు రామాయణంలోని వివిధ ఘట్టాలను వేదికపై ప్రదర్శిస్తారు. చివర రోజు రావణుడి సంహరణతో ఉత్సవాలను ముగిస్తారు. ఈ మేరకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే శ్రీరామాలయం, బృందావతిమాత, అభయాంజనేయస్వామి ఆలయాలతో పాటు గ్రామ ముఖద్వారాన్ని సుందరంగా అలంకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామస్థులతో వజ్రపుకొత్తూరు ఎస్‌ఐ రామారావు సమావేశం నిర్వహించారు. గతంలో గ్రామంలో బాణాసంచా విస్ఫోటనం కారణంగా పది మంది వరకూ మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఉత్సవాల్లో బాణసంచా ఉపయోగించరాదని ఆదేశించారు.



నువ్వలరేవులోని శ్రీరామాలయం

### సంప్రదాయాలను కొనసాగిస్తున్నాం



నువ్వలరేవులో శ్రీరామనవమి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తాం. 300 ఏళ్లుగా సంప్రదాయాలను కొనసాగిస్తున్నాం. ఈ ఏడాదీ కూడా విజయవంతంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశాం.

- బైనపల్లి దేవా, గ్రామకమిటీ ప్రతినిధి, నువ్వలరేవు



వెంకటేష్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు రోహిణి, చంద్రరావు

## సివిల్స్‌లో వెంకటేష్ సత్తా

● జాతీయస్థాయిలో 467వ ర్యాంకు

జలుమూరు, ఏప్రిల్ 16: జలుమూరు మండలం అల్లాడపేట గ్రామానికి చెందిన బాన్న వెంకటేష్ సివిల్స్ ఫలితాల్లో సత్తాచాటారు. ఐఏఎస్ లక్ష్యంతో కష్టపడి చదివి రెండో ప్రయత్నంలోనే జాతీయ స్థాయిలో 467వ ర్యాంకు సాధించి ఔరా అనిపించారు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెంకటేష్ తండ్రి చంద్రరావు ధాన్యం వ్యాపారి. తల్లి రోహిణి గృహిణి. వెంకటేష్ ప్రాథమిక విద్యాభ్యాసం అల్లాడపేటలోనే సాగింది. మునసబుపేటలోని ప్రైవేటు స్కూల్‌లో పదోతరగతి వరకు చదివారు. విశాఖ శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. అనంతరం 2019లో తమిళనాడు తిరుచనాపల్లిలో ఎన్ఐటీ పూర్తిచేసి.. రెండేళ్ల తమిళనాడులోని కోల్‌కం కంపెనీలో పనిచేశారు. తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. తొలి ప్రయత్నంలో గురి తప్పగా.. రెండో ప్రయత్నంలో 467వ ర్యాంకు సాధించి జిల్లాకు వన్నె తెచ్చారు. ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని వెంకటేష్ తెలిపారు. వెంకటేష్‌కు జాతీయస్థాయిలో ర్యాంకు రావడంతో గ్రామస్థులు ఆయనను అభినందించారు.

# వస్తానన్నావ్.. ఎందుకు రాలేదు?

● మీ ఆయనతో కాకుండా.. ఒంటరిగా రాలేకపోయావా?

● ఓ మహిళతో వైసీపీ ఎమ్మెల్యే అసభ్యకర వ్యాఖ్యలు

● సోషల్ మీడియాలో వైరల్ ● 2014లో ఇదేస్థాయి ఆరోపణలు

శ్రీకాకుళం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 'వస్తానన్నావ్.. ఏంరాలేదు? మీతో వచ్చిన ఆయన ఎవరు? మీ ఆయనా. ఆయన ఏం చేస్తున్నారు? ఆయన పనికి ఎందుకు ఇబ్బంది పెట్టావు? ఒంటరిగా రాలేకపోయావా?'.. ఇదీ జిల్లాలోని ఓ వైసీపీ ఎమ్మెల్యే సాధారణ గృహిణితో మాట్లాడిన సంభాషణ. కుమారుడి చదువుకు సంబంధించి ఒక ధ్రువీకరణ పత్రం కోసం ఆమె ఎమ్మెల్యే వద్దకు వెళ్లగా.. ఇలా అసభ్యకరంగా మాట్లాడడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఓ వైసీపీ ఎమ్మెల్యేపై మహిళలను వేధిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. 2014 ఎన్నికల సమయంలో ఆయనపై ఇదే తరహా ఆరోపణలు వచ్చాయి. ఇంట్లో పనిచేసే వారిపై లైంగిక వేధింపులకు దిగుతారన్న అపవాదు ఉంది. గత ఎన్నికల్లో గెలిచిన ఈయనకు ఈసారి టికెట్ రాదని అంతా భావించారు. కానీ అనూహ్యంగా టికెట్ దక్కించుకున్నారు. అయితే తాజాగా ఈయన ఓ గృహిణితో అసభ్యకరంగా మాట్లాడిన ఆడియో ఒకటి వైరల్ అవుతోంది. ఓ గృహిణి తన కుమారుడి ఉన్నత చదువుల కోసం సదరు ఎమ్మెల్యేను ఆశ్రయించింది. భర్తతో ఆయన్ను కలిసింది. అయితే ఆమెపై మనసు పడిన ఎమ్మెల్యే నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. కలుస్తానన్నావ్ ఎందు కలవలేదంటూ ఫోన్ సంభాషణ ప్రారంభించారు. మీ భర్త ఏ పనిచేస్తుంటారని ప్రశ్నిస్తే సదరు మహిళ కార్పెంటర్ అని చెప్పింది. ఆయనను ఎందుకు తెచ్చావు. ఆయన పనికి ఇబ్బంది ఎందుకు పెట్టావు. నువ్వే వచ్చి ఉంటే సరిపోయేది కదా? ఎప్పుడు వస్తావు? నేను వైజాగ్ వెళుతున్నా.. ఎల్లుండి వస్తావు కదా? రెడీ కదా? నాన్చుడి ధోరణితో మాట్లాడగా సదరు మహిళ ఏంటి సార్? అని అడిగేటప్పటికి సంభాషణ ఆగిపోయింది. అక్కడకు కొద్దిసేపటికే ఎమ్మెల్యే అనుచరుడి నుంచి ఫోన్ వచ్చింది. బాగున్నారా? అంటూ పలకరించి.. సార్ ఫోన్ చేశారా? అని సదరు మహిళను అడగ్గా.. ఇప్పుడే చేశారని ఆమె సమాధానం చెప్పింది. సార్.. మీ మీద మనసు పారేసుకున్నారు. ఎప్పుడు వస్తారు? అని అడగ్గా.. ఏంటి సార్? అని సదరు మహిళ ప్రశ్నించేసరికి ఒక్కసారిగా ఫోన్ కట్ అయింది. జిల్లాలో ఈ అంశం వైరల్ అయింది. ఈ ఎమ్మెల్యేపై 2014 ఎన్నికల సమయంలో కూడా ఇదే తరహా విమర్శలు వచ్చాయి. తాజాగా మళ్లీ అదే నేత అసభ్యకర వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

## ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కాశీబుగ్గ, ఏప్రిల్ 16: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయుడు తమ్మినేని మన్మథరావును సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు. కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్) మన్మథరావు మార్చి 30న ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఎన్నికల అధికారులు గుర్తించి డీఈవో వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ ఉపాధ్యాయుడిని మంగళవారం సస్పెండ్ చేశారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

కలెక్టరేట్, ఏప్రిల్ 16: జిల్లాలో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వేసవిలో నీటిఎద్దడి నివారణకు నిధులు అందుబాటులో ఉంచామని తెలిపారు. వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్ సిబ్బందికి అవగాహన కల్పించా మన్నారు. ఉపాధిహామీ పథకం గణాంకాలను వివరించారు.

# జగనన్న ప్రభుత్వంలో.. కాలువలూ వదల్లేదు

● నరసన్నపేటలో యథేచ్ఛగా ఆక్రమణలు

● పట్టించుకోని అధికారులు

(నరసన్నపేట)

నరసన్నపేటలో గత ఐదేళ్లుగా జగన్ ప్రభుత్వంలో వంశధార కాలువలు కబ్జా అవుతున్నాయి. నరసన్నపేట మీదుగా వెళ్తున్న 11 ఆర్ కిల్లాం, ఎన్బీసీ కాలువలు జమ్ము జంక్షన్‌కు సమీపంలో ఉన్నాయి. దీంతో ఇక్కడ భూముల ధరలు రూ.కోట్ల లో పలుకుతున్నాయి. జమ్ముజంక్షన్, హడ్కోకాలనీ, వంశధార నగర్, దేశవానిపేట, రావులవలస తదితర గ్రామాల వద్ద కాలువలను అధికారపార్టీ నేతలు ఆక్రమించి.. అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఆక్రమణలపై వంశధార అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

● రావులవలస వద్ద వంశధార పిల్లకాలువను అధికారపార్టీ నాయకుడు ఆక్రమించి భవనాలు నిర్మించారు.

● జమ్ముజంక్షన్ వద్ద ఎన్బీసీ కాలువను ఆక్రమించి తవ్వకాలు చేపడుతున్నారు. ఈప్రాంతంలో కొంత జిరాయితీ భూమి ఉండగా.. మరికొంత కాలువ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి స్థానిక నాయకులు సహాయంతో బిల్డర్ పెద్దపెద్ద భవంతులు నిర్మించారు. ఒక రియల్ఎస్టేట్ వ్యాపారి ప్లాట్లు కూడా విక్రయించారు.

● 11 ఆర్ కిల్లాం కాలవగట్టును పలు ప్రాంతాల వద్ద ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. తాజాగా నేషనల్ హైవేకు సమీపం, హడ్కోకాలనీలో కాలువ స్థలాన్ని ఆక్రమించారు.

● బొరిగివలస- కళాసీ కాలనీకి సమీపంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇలా ఎక్కడికక్కడ కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రావులవలసలో పిల్లబట్టిపై చేపట్టిన అక్రమ నిర్మాణాలు

# దయనీయంగా పైడిగాం ప్రాజెక్టు


● తితలీలో కొట్టుకుపోయిన ప్రధాన చానెల్

● మూడు మండలాలకు అందని సాగునీరు

● ఆందోళన చెందుతున్న రైతులు

(సోంపేట)

ఒకప్పుడు మూడు మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరందించే పైడిగాం ప్రాజెక్టు పరిస్థితి దయనీయంగా మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాప్రతినిధులు దీనిని పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. దీంతో సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. సోంపేట మండలంలో మహేంద్రతనయ నదిపై మాలగోవిందపురం పంచాయతీ బాతుపురం- కొత్త బాతుపురం గ్రామాల మధ్య పైడిగాం ప్రాజెక్టు ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి సోంపేట, కంచిలి, మందస మండలాల పరిధిలోని 34 గ్రామ పంచాయతీల్లో సుమారు పదివేల ఎకరాలకు సాగునీరందేది. సోంపేట మండలంలోని పైడిగాం, హంసమొర, సుంకిడి, విక్రంపురం, బుషాభద్ర, మాకన్నపురం, పొత్రఖండ, బేసిరామచంద్రపురం, కొర్లాం, పలాసపురం, సోంపేట, జింకిభద్ర తదితర గ్రామాల్లో 3,950 ఎకరాలకు సాగునీరు వచ్చేది. కంచిలి మండలంలోని శాసనాం, జే.నారాయణపురం, ఉప్పర పేటలు-3, చిత్రాయిపురం, గోకర్ణపురం, పోటిగుడ్డి, మధుపురం, బూరగాం తదితర గ్రామాల రైతులకు వందలాది ఎకరాల్లో సాగునీరు అందేది. మందస మండలం మందస, పొత్తంగి గ్రామాల పరిధి రైతులకు సాగునీరు లభించేది. తితలీ తుఫాన్ సమయంలో ప్రధాన చానెల్ కొట్టుకుపోయింది. తర్వాత పాలకులెవరూ మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు 135 క్యూసెక్కుల నీరు రావాల్సి ఉండగా ఒడిశాలోని పురియా సాయివద్ద డ్యాం నిర్మాణం వలన 50 క్యూసెక్కులు మాత్రమే వస్తోంది. పైడిగాం చానెల్ మరమ్మత్తుల కోసం 1999-2000సంవత్సరంలో రూ.1.35 కోట్లు మంజూరయ్యాయి. 2014-15లో రూ.9.75 కోట్ల నిధులు మంజూరైయ్యాయి. ఈ నిధులతో 3/2 నుంచి 6/2 వరకు గోడల నిర్మాణం, దిగువ భాగంలో కాంక్రీటు పనులు పూర్తి చేశారు. 0/0 నుంచి 0/6 వరకు కాలువకు రెండు వైపుల గోడలు నిర్మించాల్సి ఉంది. పైడిగాం ప్రాజెక్టని లడ్డగుడ్డి వద్ద 3/2 వద్ద నిర్మిస్తే చీకటి గెడ్డ, ఘాటీ గెడ్డ, కళింగదళ్ నుంచి మిగులు నీరు ప్రాజెక్ట్‌లో చేరుతుంది. ప్రస్తుతం కేవలం మహేంద్ర తనయ నదికి చేరిన వరద నీరు మాత్రమే వస్తోంది. కాలువల్లో పేరుకుపోయిన పూడిక తీసేందుకు ఉపాధిహామీ పనులు మంజూరు కాగా.. కొన్ని గ్రామాల్లో మాత్రమే పనులు చేపడుతున్నారు. దీంతో చానెల్ నుంచి దిగువ ప్రాంతానికి నీరందించే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పైడిగాం ప్రాజెక్టుకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని, సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అధ్వానంగా పైడిగాం కాలువ



పైడిగాం ప్రాజెక్టు

# 'పేట'లో తాగునీటికి కటకట

● ఇబ్బంది పడుతున్న ప్రజలు

(నరసన్నపేట)

నరసన్నపేట పట్టణ ప్రజలు తాగునీటితో ఇబ్బందులు పడుతున్నారు. శివనగర్, కళాసీల కాలనీ, శ్రీరామనగర్, మారుతీనగర్ తదితర వీధుల్లో నెలరోజులుగా కుళాయిలు పనిచేయడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ల పనులు సక్రమంగా నిర్వహించక పోవడంతో తమకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. బండివీధికి వచ్చిన పైపులైన్ మూసి.. పెద్దపేట నుంచి వచ్చే పైపులైన్‌కు కనెక్షన్ ఇవ్వడంతో తమకు కుళాయి నీరు రావడం లేదని బండివీధి మహిళలు చెబుతున్నారు. మారుతీనగర్‌లో కూడా పైపుల పనులు సక్రమంగా చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు ట్యాంకుల ద్వారా అప్పుడప్పుడు నీటిని సరఫరా చేస్తున్నారని, క్యాన్లతో తాగునీటిని కొనుగోలు చేసుకుంటున్నామని పట్టణ ప్రజలు చెబుతున్నారు. ఈవిషయంపై పంచాయతీ ఈవో చిన్నారావు వద్ద ప్రస్తావించగా రోడ్డు విస్తరణ పనుల్లో పైపులైన్లు దెబ్బతిన్నాయని తెలిపారు. పైపులు లీకైయితే పనులు చేపట్టి తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు.



శివనగర్ కాలనీలో ట్యాంకుతో తాగునీటి సరఫరా..

### ఇబ్బంది పడుతున్నాం



నెలరోజులుగా పబ్లిక్ కుళాయి ద్వారా తాగునీరు రావడంలేదు. పంచాయతీ అధికారులు నామమాత్రంగానే ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తాగునీరు, వంట చేసుకునేందుకు నీటిని కొనుక్కుంటాన్నాం. పంచాయతీ అధికారులు వెంటనే చొరవ తీసుకోవాలి.

-సరియపల్లి మధు, బండివీధి

### క్యాన్ రూ.25కి కొంటున్నాం



తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. వేసవిలో పడుతున్న ఇబ్బందిని పట్టించుకునే నాథుడే కరవయ్యారు. నెలరోజుల నుంచి వాటర్ క్యాన్ రూ.25కి కొనుగోలు చేస్తున్నాం.

-బి.కేశవరావు, జగన్నాథపురం, నరసన్నపేట

## దుర్గంధం




గార, పలాస మండలం లొద్దభద్ర గ్రామాల్లో రోడ్డు పక్కనే చెత్తకుప్పలు

గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు దర్శనమిస్తుండడంతో ప్రజలు దుర్గంధంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించాల్సి ఉన్నా అవి పనిచేయకపోవడంతో గ్రామాల శివారుల్లో రోడ్ల పక్కన వేస్తున్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గార మండల కేంద్రంలోని పాత ఎంపీడీవో కార్యాలయం నుంచి వంశధార నదికి వెళ్లే మార్గంలో ఇదే పరిస్థితి. అలాగే పలాస మండలం లొద్దభద్ర గ్రామంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా చెత్తను డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. -గార/పలాస రూరల్

## జీడి పిక్కలకు గిట్టుబాటు ధర కల్పించండి

● చంద్రబాబుకు వినతులు



చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీ సురేఖ

**పలాసరూరల్/వజ్రపు కొత్తూరు:** టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రిని రైతాంగ సమస్యల సాధన కమిటీ సభ్యులు, మెట్టూరు ఎంపిటిసి కొండ సురేఖ తదితరులు వేర్వేరుగా కోరారు. ఈ మేరకు కాశీబుగ్గ టీడీపీ కార్యాలయంలో చంద్రబాబును వారు కలిసి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా జీడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. జిల్లాలో 30 మండలాల్లో 44 వేల హెక్టార్లలో జీడి పంటను సాదు చేస్తున్నామని, ఎకరాకు రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందన్నారు. దీంతో మద్దతు ధర లేకపోవడం, విదేశీ పిక్కలను వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో ప్రతిఏటా రైతులు నష్ట పోతున్నారన్నారు. చంద్రబాబును కలిసిన వారిలో గౌతు శిరీష, రైతాంగ సాధ న కమిటీ సభ్యులు మామిడి మాధవరావు, కార్యదర్శి గొర్లె చలపతి, కిక్కర ఢిల్లీరావు, మెట్టూరు మాజీ ఎంపీటీసీ భారతి తదితరులు పాల్గొన్నారు. అలాగే రైతాంగ సాధన కమిటీ సభ్యులు అచ్చెన్నాయుడును కలిసి సమస్యపై వినతిపత్రం ఇచ్చారు.

## తెలగ కులస్థులను బీసీ జాబితాలో చేర్చండి

**కాశీబుగ్గ:** తెలగ కులస్థులు ఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉపాధి పరంగా వెనుకబడి ఉన్నారని అందువల్ల బీసీ జాబితాలో చేర్చాలని తెలగ రిజర్వేషన్ ఉద్యమ నేత పల్లంట్ల వెంకట రామారావు కోరారు. ఈ మేరకు మంగళవారం కాశీబుగ్గలో టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తెలగ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దీనికి చంద్రబాబు స్పందిస్తూ.. పరిశీలించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘ సభ్యులు శ్రీనివాస్‌రావు, సురేష్, వెంకటేష్, రవి, ఎన్.వాసు, భాస్కర రావు తదితరులు ఉన్నారు.



చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న తెలగ సంఘ నేత పీవీ రామారావు

## అరాచక పాలనకు అంతం పలకాలి: బగ్గు



కొమ్మసరియాపల్లిలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

**జలుమూరు (సారవకోట):** రాష్ట్రంలో సాగుతున్న అరాచక రాక్షస పాలనకు అంతం పలకాలని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. కొమ్మసరియాపల్లి, పెద్దగుజ్జువాడ, వాండ్రాయి, రంగాపురం గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథ కాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్ర మంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, సాధు చిన్నికృష్ణంనాయుడు, తాడేల భీమారావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బగ్గు రమణమూర్తి సతీమణి బగ్గు సుగుణమ్మ టెక్కలిపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థి రమణమూర్తిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, కన్వీనర్ బగ్గు గోవిందరావు, తెలుగు మహిళ కార్యదర్శి గురుబెల్లి ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలోకి 200 కుటుంబాలు

**పాతపట్నం:** తిడ్డిమి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, దివంగత కొంచాడ వీరభద్రరావు కుమారుడు జగన్నాథ రావు ఆధ్వర్యంలో సుమారు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం వీరికి ఎన్డీఏ అభ్యర్థి మామిడి గోవిందరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఎన్డీయే అభ్యర్థి మామిడి గోవిందరావు తెలిపారు. ఉమ్మడి పార్టీల క్యాడర్ పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావుతోనే మా ప్రయాణమని మెళియాపుట్టి మండలం రట్టిణి టీడీపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు గోవిందరావును కలిసి మద్దతు ప్రకటించారు. దుర్యోధన జెన్నా, పవిత్ర సామూల్ పాల్గొన్నారు. ఎన్డీయే అభ్యర్థి మామిడి గోవిందరావుకు తామంతా మద్దతు ప్రకటిస్తున్నట్లు సంతలక్ష్మీపురం మాజీ సర్పంచ్ సవర కన్నయ్య తదితరులు ప్రకటించారు. ఈ మేరకు మామిడి గోవిందరావు సమక్షంలో టీడీపీలో చేరారు. సీనియర్ నాయకులు సలాన మోహనరావు, తూలుగు తిరుపతిరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గేదెల చైతన్య బీజేపీ నాయకుడు సలాన రాఘవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన కొంచాడ జగన్నాథరావు తదితరులకు కండువా వేస్తున్న గోవిందరావు

## పీఎంపురం నుంచి 200 కుటుంబాలు చేరిక



టీడీపీలో చేరిన వారితో గౌతు శిరీష

**వజ్రపుకొత్తూరు:** టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలో సమర్థ పాలన సాధ్యమని ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. మంగళవారం పెద్దమురహరిపురం పంచాయతీకి చెందిన 200 కుటుం బాలు వైసీపీని వీడి టీడీపీ, జనసేనల్లో చేరాయి. ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని ఆమె కోరారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ కలిశెట్టి పార్వతి, ఉప సర్పంచ్ గోపాల్‌తో పాటు 13 మంది వార్డు సభ్యులున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొరకల వసంతరావు, టీడీపీ నాయకులు దువ్వాడ హేమబాబుచౌదరి, పుచ్చ ఈశ్వరరావు, శోభారాణి పాల్గొన్నారు.

### గ్రామాల్లో సూపర్ సిక్స్‌పై అవగాహన

**టెక్కలి:** బూరగాం గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, బీజేపీ నాయకులు వంజంగి వేణుగోపాల్, బసవల అప్పలస్వామి పాల్గొన్నారు. ● **నందిగాం:** సూపర్ సిక్స్ పథకాలతో ఆర్థిక చేయూత లభిస్తుందని టీడీపీ నాయకులు పి.చంద్ర శేఖర్, ఎం.బాలకృష్ణ అన్నారు. మంగళవారం కైజోల, భర్తుపురం, కందులగూడేం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

## అధికారంలోకి రానున్నది మన ప్రభుత్వమే..

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



సంతబొమ్మాళి: యర్నాగులపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

**టెక్కలి, ఏప్రిల్ 16:** కార్యకర్తల్లారా కొద్దిరోజులు ఓపిక పట్టండి. అధికారంలోకి వచ్చేది మన ప్రభుత్వమే. ఈ ఎన్నికలతో వైసీపీ దుకాణం బంద్ అవుతుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గడచిన ఐదేళ్ల పాటు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలంతా ఎవరికి దొరికింది వారు దోచుకుతిన్నారని, ఇసుక, భూములు, గనులు బుక్కే శారని ఆరోపించారు. కార్యకర్తల్లో విభేదాలుంటే పక్కనపెట్టి అందరూ కలిసి కట్టుగా పనిచేయా లన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ వివరించాలన్నారు. ఈనెల 22న టెక్కలి టీడీపీ అభ్యర్థిగా తాను నామినేషన్ వేస్తున్నందున పెద్ద ఎత్తున క్యాడర్ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### టీడీపీలోకి వలసలు

**టెక్కలి/సంతబొమ్మాళి:** సంతబొమ్మాళి, టెక్కలి మండలాల నుంచి పలువురు వైసీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. టెక్కలి మండలం తొలుసూరుపల్లి, జయ కృష్ణాపురం, మున్సబుపేట గ్రామాల నుంచి సత్తారు మల్లేశ్వరరావు, కర్రి ఈశ్వర్, మొజ్జాడ సూర్యనారాయణ, సింహాద్రి, వైకుంఠ రావు తదితరులు, సంతబొమ్మాళి మండలం హనుమంతునాయుడుపేటకు చెందిన మాజీ సర్పంచ్ కోళ్ల భాస్కరరావు, బైరాగి, పాలకొండ నారాయణ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి అచ్చెన్నాయుడుతోనే సాధ్యమని, అందుకే వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బోయిన గోవిందరాజులు, రమేష్, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, బగాది శేషగిరి, జీరు భీమారావు, అట్టాడ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### అండగా ఉంటున్నాం.. గెలిపించండి

**సంతబొమ్మాళి:** నియోజకవర్గంలో ఏ గ్రామంలో ఏ ఎక్కరికి ఆపద వచ్చినా అండగా ఉంటున్నా మని, రానున్న ఎన్నికలో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. మంగళవారం నరసాపురం, గోవిందపురం పంచాయతీల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని గ్రామాలను అభివృద్ధి చేశామని, ఎవరికి ఏ సమస్య వచ్చినా అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందించామన్నారు. నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు,రెడ్డి అప్పన్న, మాజీ జడ్పీటీసీ బాడాన వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### క్రికెట్ అకాడమీలో శిక్షణకు జమ్ము కుర్రోడు



**నరసన్నపేట:** జమ్ము గ్రామానికి చెందిన టింక ప్రేమ్‌కుమార్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) ఆధ్వర్యంలో అండర్-14 క్రికెట్ శిక్షణకు ఎంపికయ్యాడు. క్రికెట్ అకాడమీలో చేరేం దుకు ఈనెల 22న హాజరు కావాలని శాయ్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రేమ్‌కుమార్ చిన్న తనం నుంచి క్రికెట్ పట్ల మక్కువతో ప్రాక్టీసు చేశాడు. ఇటీవల శాయ్ నిర్వహించిన పోటీల్లో సత్తా చాటి అకాడమీకి ఎంపికయ్యాడు. ప్రేమ్‌కుమార్ ఎంపిక పట్లవైఎంసీఏ కార్యదర్శి గొద్దు చిట్టిబాబు, కోచ్ శ్రీనివాసరావు హర్షం వ్యక్తంచేసి అభినందించారు.

### శ్మశాన వాటికకు తాత్కాలిక రోడ్డు ఏర్పాటు

**మెళియాపుట్టి:** ప్రభుత్వం శ్మశాన వాటిక నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో కొసమాల గ్రామ దళితుల శ్మశాన వాటికకు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జొన్న చిన్నబాబు ఆర్థిక సాయంతో తాత్కాలికంగా రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోలేదని స్థానిక దళితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయుడు స్పందించి ముందుకు రావడం అభినందనీయమని ధనంజయ్ తదితరులు అన్నారు.

### పలాస సీపీఐఎంఎల్ లిబరేషన్ అభ్యర్థిగా కామేశ్వరరావు

**కాశీబుగ్గ:** పలాస నియోజకవర్గం సీపీఐఎంఎల్ అభ్యర్థిగా పోతనపల్లి కామేశ్వరరావును ఎంపిక చేసినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు, నేతలు మల్లేశ్వరరావు, దుష్యంత్ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. జాతి సంపదలైన రైల్వేలు, గనులు, స్టీల్ ప్లాంట్, విద్యుత్ సంస్థలను కార్పొరేట్లకు బీజేపీ ప్రభుత్వం ధారాదత్తం చేసే ప్రయత్నాలు దారుణమన్నారు. పార్టీ నాయకులు అప్పారావు, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### 'దీక్ష' కోర్సును ఉపాధ్యాయులు పూర్తి చేయాలి

**హిరమండలం:** దీక్ష కెరీర్ గైడెన్స్ కోర్సును ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పూర్తి చేయాలని సర్వశిక్షాభియాన్ ఏఎంవో గుంట లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే ఒకటిలోగా ఐదు కోర్సుల్లో విధిగా రిజిస్టర్ కావాలని సూచించారు. 10 లోగా కోర్సులు పూర్తి చేసి సర్టిఫికేట్లు పొందాలన్నారు. అనంతరం స్థానిక కేజీబీవీని సందర్శించి విద్యార్థినుల విద్యా సామర్థ్యాలను పరీక్షించారు.

### ఇన్‌చార్జి డిప్యూటీ డీఈవోగా విలియమ్స్



**టెక్కలి:** టెక్కలి డివిజన్ ఇన్‌చార్జి ఉపవిద్యాశాఖాధికారిగా ఎస్.విలియమ్స్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పోలవరం జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఈయనను ఎంఈవోలు డి.తులసీరావు, చిన్నారావు, పలువురు హెచ్ ఎంలు, యూటీఎఫ్ ప్రతినిధులు కలిసి అభినందించారు.

### మూగజీవాలకు నీటి కుండీలు ఏర్పాటు చేయాలి

**మెళియాపుట్టి:** వేసవిలో గ్రామాల్లోని చెరువులు ఎండిపోవడంతో నీరు లేక మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని, అందువల్ల నీటి కుండీలను ఏర్పాటు చేయాలని గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ జానకమ్మ, పశు వైద్యాధికారి అనిల్‌కుమార్‌లకు వినతిపత్రాలు అందించారు. కొన్ని రోజులుగా ఎండల తీవ్రత ఎక్కువ గా ఉండడంతో మూగజీవాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత చెరువుల్లో పనులు చేపట్టకపోవడంతో నీరు నిలువ ఉండడం లేదన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం నాయకులు దుక్క బాలరాజు, శేషగిరి, కృష్ణారావు, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీలో చేరిన దానేటి పద్మజ



దానేటి పద్మజకి కండువా వేసి అభినందిస్తున్న చంద్రబాబు

**పలాస/కాశీబుగ్గ:** పలాస-కాశీబుగ్గ పట్టణంలోని సూర్యతేజ జూనియర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ దానేటి పద్మజ టీడీపీలో చేరారు. మంగళ వారం పార్టీ కార్యాలయంలో ఆమెకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ నేత గౌతు శిరీష సేవా దృక్పథం, ఇచ్చిన మాట కోసం నిరంతరం శ్రమించి ఈ ప్రాంతానికి మంచి చేయాలన్న తపనతో పనిచేస్తున్నారన్నారు. ఆమెకు మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా శిరీష విజయానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

### సందడిగా ఫేర్‌వెల్



రెడ్డికపేట పాఠశాలలో డ్యాన్సు చేస్తున్న చిన్నారులు

**నరసన్నపేట:** ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఫేర్‌వెల్ నిర్వహించారు. రెడ్డికపేట పాఠ శాలలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. అలాగే బొరిగివలస పాఠశాలలో ఎండీఎంను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.జ్యోతి, ఉపాధ్యాయిని అనురాధ పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

**జలుమూరు:** హరికృష్ణమ్మపేట శ్రీరామ మందిరంలో మంగళవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల సందర్భంగా వేద పండితులు పురోహితులు అక్కాజోస్యుల రాజశేఖర శర్మ నేతృత్వంలో కుంకుమ పూజలు చేపట్టారు. బుధవారం 108 పూర్ణ కలశాలతో గ్రామోత్సవం, రాత్రి సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

### నవమికి ఏర్పాట్లు

**టెక్కలి:** శ్రీరామనవమి పురస్కరించుకొని పలు రామ మందిరాలు, ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ఈ వేడుకలు బుధవారం నిర్వహించనున్నారు. తెలిసీలాపురం, సీతాపురంతో పాటు టెక్కలిలో కోదండ రామవీధి, శంభానవీధి, చిన్న చాకలివీధి రామమందిరాలను సుందరంగా అలంక రించారు. శ్రీరాముని కల్యాణం, పూజా కార్యక్రమాలు, ఆధ్యా త్మిక ప్రవచనాలు, తిరువీధి, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### అమ్మవారి గజముద్ద ఊరేగింపు

**నందిగాం:** నందిగాంలో కొలువైన సామాలమ్మతల్లి అమ్మవారి ఆలయ ఐదో వార్షికోత్సవం సందర్భంగా చివరి రోజు మంగళవారం అమ్మ వారి గజముద్దను ఊరేగించారు. మేళ తాళాలు, విశేష వేష ధారణలు, ఆట, పాటలు మధ్య వీధుల్లో మహిళల ఘటాలతో ఊరేగింపు సాగింది.



నందిగాం: కలశాలతో ఊరేగింపు

### దుర్గామాతకు..

**కాశీబుగ్గ:** కాశీబుగ్గ శ్రీపంచముఖ ఆంజనేయ ఆలయంలో వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాతను మంగళవారం శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి 51 రకాల వంటకాలతో నివేదన చేశారు. ఉగాది వేడుకల్లో భాగంగా అర్చకులు బుద్ధి రామ్, రాజేష్, గణేష్ ఆధ్వర్యంలో సప్తశతి పారాయణం, చండీ యాగం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



51 రకాల పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యం

## గ్యాస్ ప్రమాదాల నివారణపై అవగాహన

**పలాస:** ఇళ్లలో గ్యాస్ ప్రమాదాల నివారణపై స్థానిక అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు మంగళవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. గ్యాస్ లీకై మంటలు వ్యాపిం చిన వెంటనే మహిళలు బయటకు పరుగులు తీస్తారని, దీనివల్ల అనేక అనర్థాలు జరగడంతో పాటు ఒక్కోమారు ఆస్తినష్టం జరుగుతుందన్నారు. ప్రాథమికంగా మేలుకుంటే ఇటువంటి ప్రమాదాలు నివారిం చవచ్చని ప్రయోగాత్మకంగా చూపించారు. ప్రమాదాలు పెద్దవి గా ఉంటే తమకు సమాచారం అందించాలని సూచిం చారు. కార్యక్రమంలో సిబ్బంది యుగంధర్, శ్రీనివాసరావు, సంతోష్ కుమార్, రాము, రవిశంకర్, చిరంజీవి, గోపాల్ పాల్గొన్నారు.



గ్యాస్ మంటల వ్యాప్తి నివారణను ప్రయోగాత్మకంగా వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## వేట నిషేధం తప్పనిసరిగా పాటించాలి

**సంతబొమ్మాళి:** సముద్రంలో చేపల వేట నిషేధాన్ని మత్స్యకారులు తప్పనిసరిగా పాటించాలని మత్స్యశాఖ డీడీ పీవీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం భావనపాడులో చేపల వేట నిషేధంపై మత్స్యకారులతో మాట్లాడారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో మర పడవలతో వేట చేయడం నిషేధమన్నారు. సంప్రదాయ తెప్పలకు మినహాయింపు ఉంటుందన్నారు. సముద్రంలో మత్స్య సంపద పెరిగేందుకు వేట నిషేధం అమలవుతుందన్నారు. వేట నిషేధం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మెరైన్ ఏఎస్ఐ ఎంఈఆర్కే రెడ్డి, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు ఆదినారాయణ, ఫిషరీస్ అసిస్టెంట్ దామోదర్, సాగర్‌మిత్ర శ్రీకాంత్ పాల్గొన్నారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న ఫిషరీస్ డీడీ శ్రీనివాసరావు

## ఆహ్లాదం కనుమరుగు

● ఆసుపత్రి ఆవరణలోని క్వార్టర్స్ తొలగింపు, చెట్లు నరికివేత

● నీడకరువైందంటూ రోగుల బంధువుల ఆవేదన

(పాతపట్నం)

స్థానిక సామాజిక ఆసుపత్రిలో అభివృద్ధి పేరిట చెట్లను తొలగించారు. దీంతో నీడ కరువై రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఆసుపత్రి అభివృద్ధి పనుల పేరిట ఆవరణలో ఉన్న సిబ్బంది నివాస గృహాలు, చెట్లను తొలగించారు. అయితే ఎటువంటి పనులు చేపట్టక పోవడంతో ఆహ్లాదం కరువైందన్న వాదనలు వినిపిస్తు న్నాయి. మినీ పార్కు ఏర్పాటు చేస్తామని చెప్పినా నేటికీ అమలు కాలేదు. అధికారుల అనాలోచిత నిర్ణ యాల వల్ల నీడను కోల్పోయా మని రోగులు ఆవేదన చెందుతున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కల పెంపకానికి ఐదేళ్ల సమయం చాలలేదా అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. సిబ్బంది క్వార్టర్స్ తొలగించడంతో వారంతా ప్రైవేటు అద్దె భవనాల్లో ఉండాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రోగులు, సిబ్బంది కోరుతున్నారు.



క్వార్టర్స్, చెట్లు తొలగించడంతో పచ్చదనం కరువైన దృశ్యం

## ఠారెత్తిస్తున్న ఎండలు

**నందిగాం/వజ్రపుకొత్తూరు:** ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతుండ డంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు సాహసించడం లేదు. అత్యవసరమైతేనే బయటకు వస్తున్నారు. ఎండల తీవ్రతకు ప్రజలంతా ఉక్కపోతకు గురవుతున్నారు. వడగాడ్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉద్దానం ప్రాంతంలోనూ ఈ ఏడాది ఎండల తీవ్రత వడగాల్పులకు ప్రజలు అల్లాడి పోతున్నారు. సముద్రం నుంచి వీచే గాలులు, చెట్లు నుంచి వచ్చే చల్లటి పిల్ల గాలులతో ఒకప్పుడు పేదల ఊటీగా పిలుచుకోనే ఉద్దాన ప్రాంతం నిప్పుల కొలిమిగా మారు తుండడంపై పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి.



నిర్మానుష్యంగా ఉన్న నందిగాం సర్వీసు రహదారి

## మద్యం షాపుల తనిఖీ

**మెళియాపుట్టి:** మండలం కేంద్రంలోని మద్యం షాపుల్లోని నిల్వలను ఎన్నికల నిఘా అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. డిపోను నుంచి వచ్చిన స్టాక్, అమ్మకం రికార్డులు పరిశీలించారు. ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. మెళియాపుట్టి మద్యం షాపుల పక్కన కొన్ని దుకాణాల్లో మద్యం అమ్మకాలు గుర్తించినట్టు తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు ఒకరికి రెండు సీసాలే ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ కలెక్టర్ ఉజ్వల వెంకట్, తహసీల్దార్ రాధాకృష్ణ, ఎస్ఈబీ పలాస సీఐ లక్ష్మి ఉన్నారు.

## బెల్లం ఊట ధ్వంసం

**మెళియాపుట్టి:** ముత్యలబోంతు గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో 1400 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు డివిజనల్ టాస్క్‌ఫోర్స్ సీఐ రామచంద్ర కుమార్ తెలిపారు. దీంతో పాటు 40 లీటర్ల సారా పట్టుకోవడం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్‌నాయుడు ఉన్నారు.

## ఒంటిగంట దాటితే వ్యాక్సిన్ వేయరట

**రణస్థలం:** కుక్కకాటుకు వేసే వ్యాక్సిన్‌ను మధ్యాహ్నం ఒంటి గంటదాటితే వేయమని కొండములగాం సీహెచ్‌సీ సిబ్బంది కరాఖండీగా చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మెట్టవలస గ్రామానికి చెందిన పిస్నింటి రమణ ఈనెల 13న కుక్క కాటుకు గురయ్యాడు. దీంతో అదే రోజు ర్యాబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) మొదటి డోస్ ఇదే సీహెచ్‌సీలో వేయించుకున్నాడు. రెండో డోస్ 16వ తేదీన వేయాల్సి ఉంది. దీంతో రమణ మంగళవారం సాయంత్రం రెండో డోస్ వేయించుకునేందుకు సీహెచ్‌సీకి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట దాటిన తర్వాత వ్యాక్సిన్ వేయమని సిబ్బంది చెప్పారు. సకాలంలో రెండో డోస్ వేయకపోతే ఎలా అంటూ ప్రశ్నించాడు. తనక ఏమైన జరిగితే సీహెచ్‌సీ సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తూ వెనుతిరిగాడు. దీనిపై సీహెచ్‌సీ సిబ్బందిని వివరణ కోరగా మధ్యాహ్నం ఒంటిగంట దాటితే రేబిస్ రెండో డోస్ వేయలేమని, ఉదయం పూటే వేస్తామని సమాధానం చెప్పడం విశేషం.

## ఇంటి వద్దే వృద్ధులు ఓటు వేసేందుకు చర్యలు

**కంచిలి:** దివ్యాంగులు, వృద్ధులకు ఇంటివద్దనే ఓటు వేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సుదర్శన దొర కోరారు. మంగళవారం మండలంలోని జలంత్రకోట పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ అపర్ణ పాల్గొన్నారు.


జలంత్రకోట పోలింగ్ కేంద్రంలో ఆర్వో సుదర్శనదొర

## తవ్వేసి వదిలేశారు

- కొళాయిల కోసం వీధుల్లో గోతులు
- రాకపోకలకు ఇబ్బంది ● పట్టించుకోని అధికారులు

**జి.సిగడాం:** ఇంటింటా తాగునీటి కొళాయిల కోసం బాగున్న రహదారులను తవ్వేశారు. నీరు మాట దేవుడెరుగు కాని.. రోడ్లు మాత్రం శిథిలమయ్యాయి. పెంట గ్రామంలో ఏడు నెలలు కితం తాగునీటి కోసం కొళాయిలను ఏర్పాటు చేసేందుకు తవ్విన సీసీ రోడ్లుకు మరమ్మతులు చేయకపోవడంతో రోడ్డు శిథిలమై గ్రామస్థులు నడిచేందుకు కూడా అవస్థలు పడుతున్నారు అటుగా వెళ్లే వాహనాలు సైతం కూరుకుపోతున్నాయి. శిథిలరోడ్డుపై జారి పడి గాయాలు పాలవుతున్నారు. ఇళ్ల ముందు మురుగు నిల్వ ఉండడంతో దోమల బారిన పడుతున్నాని, ఏ క్షణాన ఏ రోగాల బారిన పడతామోనని ఆ ప్రాంతం వారు భయాందోళన చెందుతున్నారు. తాగునీరు లేదు కదా.. ఉన్న రోడ్లను తవ్వి మురికి కూపాలుగా మార్చారని పాలకులు, అధికారులపై గ్రామస్థులు, ఆ వీధి వాసులు మండిపడుతున్నారు. గుత్తేదారుడు మరమ్మతులు చేపట్టక చేతిలెత్తేశాడని విమర్శిస్తున్నారు. గ్రామస్థాయి నాయకులు నిమ్మకి నీరెత్తినట్టు వ్యవహరిస్తూ శోధ్యం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


వీధిలోని రహదారి దుస్థితి

## రోడ్డుపైనే మురుగు నీరు


అచ్చిపోలవలస గ్రామ వీధి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

**పొందూరు:** దేశానికి పట్టుకొమ్మలు పల్లెలు. అటువంటిది వైసీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాల అభివృద్ధి శూన్యంగా మారింది. వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం అందించే సాధారణ నిధులు దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా వైసీపీ ప్రభుత్వం వాడుకోవడంతో అభివృద్ధికి నిధులు లేక పంచాయతీలు నిర్వీర్యమయ్యాయి. కనీసం కాలువలలో పూడిక తీయడానికి, వీధి దీపాలు వేయడానికి కూడా నిధులు లేకుండా పోయాయి. దీనికి నిదర్శనం పొందూరు మండలం అచ్చిపోలవలస పంచాయతీ అచ్చిపోలవలస గ్రామం. పూడికతో కాలువలు మూసుకోకుపోవడంతో ఇలా మురుగు నీరు రోడ్డపై ప్రవహిస్తుంది. మరమ్మతులకు నిధులు లేక వాడుకనీరు వీధుల్లోకి చేరడంతో వీధులే కాలువలుగా మారాయి. దీంతో గ్రామస్థులు మురుగు నీటి గుండానే రాకపోకలు సాగించాల్సి వస్తుంది.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

**ఆమదాల వలస:** రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని క్రాంతిపథం అసిస్టెంట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లోని కూడళ్లలో స్వయం శక్తి సంఘాల మహిళలతో ఓటు వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, రామప్పడు, వీవోఏ హరికృష్ణ, గ్రామ సంఘం ప్రతినిధులు, స్వయంశక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# నిధులు మంజూరైనా.. పనులు సాగక

- నిర్మాణానికి నోచుకోని సరుబుజ్జిలి, పొందూరు స్త్రీ శక్తి భవనాలు ● మహిళా సంఘాల సభ్యులకు తప్పని అవస్థలు

**సరుబుజ్జిలి:** ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, పొందూరులో స్త్రీ శక్తి భవనాల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. సరుబుజ్జిలిలో శిలాఫలకం వేసి విడిచిపెట్టారు. పొందూరు పునాదులతో పనులు నిలిచిపోయాయి. ఒక్క ఆమదాలవలసలో మాత్రమే భవనం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. బూర్జలో భవన నిర్మాణం పూర్తిచేసినా మహిళా సంఘాలు అప్పగించలేదు. ప్రస్తుతం భవనంపైన ఉపాధి హామీ పథకం, కిందన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారు. దీంతో మహిళా సంఘాల సభ్యులు సమావేశాలను వెలుగు కార్యాలయంలోనే నిర్వ హించాల్సి వస్తోంది. 2011లో ఒక్కో భవనా నికి రూ.25 లక్షలు నిధులను మంజూరు చేశారు. నిధులు మంజూరైనా అధికారుల నిర్లక్ష్యం పుణ్యమాని పనులు ముందుకుసాగలేదు. దీంతో శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. ఈభవనాల నిర్మాణాలకు అధికారులు స్థలాలు కూడా కేటాయించారు. ఈ నేపథ్యంలో భవనాల సదుపాయాలు లేకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు, విధులు నిర్వహించుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు.


సరుబుజ్జిలిలో భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

### ఇదీ పరిస్థితి..

సరుబుజ్జిలిలో స్త్రీ శక్తి భవనం నిర్మాణం పనులు కోసం 2011లో మండల రిసోర్స్ కేంద్రం వెనుక భాగంలో అప్పటి ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి శంకుస్థాపన చేశారు. అప్పట్లో ఈ భవనం రూ.25 లక్షలు మంజూరు చేశారు. భవనం నిర్మాణం కోసం నిధులు సరిపోవని కాంట్రాక్టరు ముందుకురాలేదు. దీంతో శిలాఫలకానికే పరిమితమయ్యింది. పొందూరులోని వెలుగు కార్యాలయం పక్కన స్త్రీ శక్తి భవనం నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయించగా శంకుస్థాపన చేసినా కాంట్రాక్టరు పనులను పునాదులతో నిలిపివేశారు.కాగా స్త్రీ శక్తి భవనాల నిర్మాణాలపైన సభ్యులు, వెలుగుసిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా అధికారులు దృష్టికి ఇటీవల తీసుకెళ్లామని సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ వెలుగు ఏపీఎంలు కమలకుమారి ప్యాండ్యన్, శ్యామలరావు, బాబూరావు తెలిపారు. ప్రస్తుతం భవనాలు లేకపోవడంతో సమావేశాలు నిర్వహించుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు.


పునాదులతో నిలిచిపోయిన పొందూరు స్త్రీ శక్తి భవనం

# అభ్యర్థుల ఖర్చులను పక్కాగా నమోదు చేయాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

**కలెక్టరేట్:** నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన రోజు నుంచే అభ్యర్థుల ప్రచారం ఖర్చులు లెక్కించేందుకు సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్వోలు, నోడల్ అధికారులతో మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచీ పక్కాగా ఖర్చులు నమోదు చేయాలి, సభలు, సమావేశాలు, ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, జెండాలు, బ్యానర్లు, పోస్టర్లు, వినియోగిస్తున్న వాహనాలు, ఏజెంట్లకు పెట్టే భోజనాల ఖర్చులు సైతం అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు ఇద్దరూ ఉమ్మడిగా సభలు, సమావేశాలు నిర్వహిస్తే ఆ ఖర్చును ఇద్దరికీ సర్దుబాటు చేయాన్నారు. జిల్లాకు ముగ్గురు ఐఆర్ఎస్ అధికారులను ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఎన్నికల కమిషన్ నియమించిందని, ఒకరు పార్లమెంట్‌కు, మిగిలిన ఇద్దరు అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తారన్నారు. సభలు, సమావేశాలు జరిగిన 24 గంటల్లోగానే అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్వోలు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ తదితరులు

### నామినేషన్ల స్వీకరణకు సిద్ధంకండి

**కలెక్టరేట్:** సాధారణ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18వ తేదీ నుంచి స్వీకరించేందుకు రిటర్నింగ్ అధికారులందరూ సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. మంగళవారం సాయంత్రం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, రోజువారీ నివేదికల పంపిణీ, ఎపిక్ కార్డుల జనరేషన్, సీజర్ మేనేజ్‌మెంట్ రిపోర్టు తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, జేసీ నవీన్, డీఆర్వోలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమానికి కృషి

- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు


ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రామ్మోహన్, గొండు శంకర్

**గార:** ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయనున్నట్టు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. మంగళవారం రాత్రి బందరువానిపేటలో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. వైసీపీ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని అన్నారు. ఇక్కడ రెండు జెట్టీల నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత గార పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బందరువానిపేట వరకు సాగింది. కార్యక్రమంలో కూటమి నాయకులు పీస వెంకటరమణమూర్తి, బడగల వెంకటప్పారావు, జీవీ రమణమూర్తి, గుండ భాస్కరరావు, కె.ఆదినారాయణ, శవ్వాన ఉమామహేశ్వరి, పైడి వేణుగోపాలం, చల్లా వెంకటేశ్వరరావు, కెప్టెన్ మైలపల్లి జనార్దనరావు, గుంటు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబును కలిసిన శంకర్

**అరసవల్లి:** పలాస పర్యటనకు విచ్చేసిన టీడీపీ అధినేత చంద్రబాబును శ్రీకాకుళం నియోజకవర్గ కూటమి అభ్యర్థి గొండు శంకర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులను కలుపుకుంటూ ముందుకు వెళ్లాలని, అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని పార్టీ అధినేత చెప్పినట్టు శంకర్ తెలిపారు.

● **శ్రీకాకుళం రూరల్:** రాష్ట్ర ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిన జగన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పాలని గొండు శంకర్ సతీమణి స్వాతి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సింగుపురం పంచాయతీ పల్లివలస గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. మాజీ సర్పంచ్ గుండ మోహన్‌రావు, కంచు చిన్నారావు, కంచు దశరధుడు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమల అభివృద్ధితోనే ఉపాధి: ఎన్ఈఆర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఈఆర్

**రణస్థలం:** పరిశ్రమలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, స్థానిక యవతకు ఉపాధి కల్పించడమే తన ధ్యేయమని ఎచ్చెర్ల నియోజకవర్గం బీజేపీ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఆత్మీయ కలయికలో భాగంగా మంగళవారం దేరసాం, వెంకటరావుపేట, చిల్లపేటరాజం, మెంటాడ, నారువ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలో ఉన్న నిరుద్యోగ యువతకు స్థానిక పరిశ్రమల్లో పూర్తి స్థాయిలో ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పైడి వేణుగోపాలరావు, పిసిని జగన్నాథంనాయుడు, పైడి అప్పడదొర, లంక ప్రభ, శ్యామ్, గొర్లె లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## కూటమితోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే అశోక్


ప్రచారం చేస్తున్న అశోక్, కూటమి నాయకులు

**కవిటి:** కూట మితోనే రాష్ట్రాభి వృద్ధి సాధ్యమని ఇచ్ఛాపురం నియో జకవర్గ ఎమ్మెల్యే బి.అశోక్ తెలిపారు. మంగళవారం కవి టిలో జనసేన నేత లు దాసరి రాజు, లోళ్ల రాజేష్‌లతో పాటు ఎమ్మెల్యే అశోక్, సతీమణి నీలోత్పల ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రాన్ని అథోగతిపాలు చేసి అన్నివర్గాలపై జగన్‌రెడ్డి భారం వేశాడ ని ఆరోపించారు ఎన్నికల్లో సానుభూతి కోసం డ్రామాలు ఆడుతున్నాడన్నారు. కార్య క్రమంలో నాయకులు మణి చంద్రప్రకాష్, పి.కుమారి, బి.రమేష్, పి.కృష్ణారావు, బి.చిన్నబాబు, బి.తిరుమలరావు, ఎ.రాజు, బి.కామరాజు, వి.రంగారావు, కె.వాసు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీలో వైసీపీ నాయకుడు చేరిక

**సోంపేట:** పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు, ఎంపీటీసీ భర్త వైశ్యరాజు వెంకట రమణ పలాసలో చంద్రబాబు నాయుడు సమ క్షంలో టీడీపీలో చేరారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేస్తానని తెలిపారు.


టీడీపీలో చేరిన వెంకన్న

## చంద్రబాబుతోనే మంచి రోజులు

**పొందూరు:** చంద్రబాబును తిరిగి ముఖ్య మంత్రిని చే యడం ద్వారానే రాష్ట్రానికి మంచి రోజులు వస్తా యని ఆమదాల వలస నియోజ కవర్గ టీడీపీ అభ్యర్థి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మంగళవారం మేజరు పంచాయతీ పొందూరు పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహరాజా మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, నాయకులు కె.సత్యనారాయణ, అన్నెపు రాము, వండాన మురళి, అనకాపల్లి చినరంగ, బలగ శంకరభాస్కర్, బాడాన గిరి, ఎంపీటీసీలు బాడాన హారిక, ఎ.వాణి, మాజీ సర్పంచ్ అనకాపల్లి విజయలక్ష్మికె. శ్రీనివాసరావు, ఎం. శ్రీనివాస రావు, సీతారామా రావు, పప్పల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న కూన రవికుమార్

## ఘనంగా కందుకూరి జయంతి

**లావేరు:** లావేరు, మురపాక శాఖా గ్రంథాలయాల్లో మంగళవారం కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రంథాలయాధికారులు మురపాక శ్రీనివాసరావు, టి.రాంబాబు కందుకూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లావేరు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విరేశలింగం పంతులు జీవిత చరిత్రపై విద్యార్థుల చే వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన టి.సంజనకు బహుమతి లభించింది. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


లావేరు శాఖా గ్రంథాలయంలో బహుమతి ప్రదానం

### తోటూరులో..

**ఇచ్ఛాపురం:** తోటూరు మండలపరిషత్ పాఠశాలలో మంగళవారం సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందుకూరి వీరేశలింగం వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: కందుకూరి వేషధారణలో..

## 18, 19 తేదీల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

**ఎచ్చెర్ల:** జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతిలో మిగులు సీట్ల భర్తీకి 18, 19 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు దుప్పలవలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని కంచిలి, కొల్లివలస, దుప్పలవలస, పాలకొండ గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్లలో బాలురుకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ప్రవేశ పరీక్ష రాసి, సమాచారం అందుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన కోరారు. ఎచ్చెర్లలోని బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో మిగులు సీట్ల భర్తీకి పెద్దపాడులోని గురుకుల పాఠశాలలో ఈ నెల 19న కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ బి.లక్ష్మి తెలిపారు.

### 19న బాలికలకు..

**శ్రీకాకుళం రూరల్:** పెద్దపాడు సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదో తరగతి మిగులు సీట్లు భర్తీ చేపట్టనున్నట్టు ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంట్రన్స్ పరీక్ష రాసిన వారిలో మెరిట్ ప్రకారం మిగిలిన ఖాళీలను భర్తీకి ఈ నెల 19న ఉదయం 9 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మెరిట్ లిస్టులోని విద్యార్థుల మొబైల్ నెంబర్లకు సమాచారం అందించినట్టు వివరించారు. పూర్తి వివరాలకు 70933 45619, 90009 14209 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## కాంగ్రెస్‌ను ఆదరించండి

**లావేరు:** పేదల పాలిట పెన్నిధిగా చరిత్రలో నిలిచిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని ఎచ్చెర్ల నియోజకవర్గం ఆ పార్టీ అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావు ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం గరుగుబిల్లి, పెదలింగాలవలస, చిగిరికొత్తపల్లి, సుభద్రాపురం, భీమునిపాలెం, అదపాక తదితర గ్రామాల్లో తన ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆబోతుల వెంకటనాయుడు, నడిమింటి సత్యనారాయణ, మీసాల లక్ష్మణ్, లావేటి అసిరప్పడు, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా సంస్కరణలతో మార్పు

**శ్రీకాకుళం క్రైం:** విద్యా సంస్కరణలతో సమాజంలో మార్పు తీసుకొచ్చిన ఘనత వైసీపీదేనని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక టౌన్ హాల్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయీ బ్రాహ్మణులతో మంత్రి ఆత్మీయ కలయిక నిర్వహించారు. తొలుత 22వ డివిజన్ బొందిలీపురంలో గడపగడపకు కార్యక్రమం చేపట్టారు.

## క్రికెట్ విజేత ఇచ్ఛాపురం

**ఇచ్ఛాపురం:** ఇచ్ఛాపురం జట్టు ఆల్ ఇండియా అండర్ -14 బాలుర క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. ఒడిశాలోని ఖుర్దాలో జరిగిన టోర్నీలో చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, న్యూఢిల్లీ, బీహార్, తమిళనాడు జట్లు పాల్గొన్నాయి. మంగళవారం జరిగిన ఫైనల్‌లో జార్ఖండ్ జట్టుతో తలపడిన ఇచ్ఛాపురం జట్టు విజేతగా నిలిచిందని నిర్వాహ కులు తెలిపారు. తొలుత బ్యాటింగ్‌చేసిన జార్ఖండ్ జట్టు 25.2 ఓవర్లలో 79 పరుగులు చేసి ఆలౌట్ కాగా ఇచ్ఛాపురానికి చెందిన చేతన్‌కు నాలుగు వికెట్లు, సాత్విక్ మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం 80 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఇచ్ఛాపురం జట్టులో జోగిందర్ 34 పరుగులు చేసి విజయంలో కీలకపాత్ర పోషించాడు. రన్నర్‌గా జార్ఖండ్ జట్టు నిలిచింది. మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్‌గా సింహ, సాత్విక్‌లకు లభించాయి. విజయానికి కారణమైన కోచ్ దక్కత గోపిని పలువురు అభినందించారు.

## ఉపాధి నిధులు పక్కదారి

**ఆమదాలవలస:** వలసల నివారణ కోసం ప్రవేశపెట్టి ఉపాధి పథకం నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సనపల అన్నాజీరావు ఆరోపించారు. మంగళవారం కొర్లకోట శ్యామలాంబ చెరువుల ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట పార్టీ నాయకులు లఖినేని నారాయణరావు, సాయిరాం, సునీల్, అప్పారావు, వెంకటరమణ, దాలయ్య, పాపారావు తదితరులు ఉన్నారు.

## వింధ్యగిరి చండీమాత యాత్ర


యాత్రలో పాల్గొన్న భక్తులు

**కవిటి:** రాజపురం పంచాయతీ వింధ్యగిరిలో మంగళవారం కుతారి చండీమాత యాత్ర ఘనంగా నిర్వహించారు. శ్రీరామనవమి ముందురోజు జరిగే ఈ ఉత్సవంలో ఒడిశాతోపాటు చుట్టు పక్క గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. చీకటి రాజవంశీయులు తొలిపూజ జరిగిన తర్వాతనే ఈ యాత్రను ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులకు అసౌకర్యం కలగకుండా గ్రామస్థులు ఏర్పాట్లుచేశారు.